DD9 వార్త
తెలుగు దినపత్రిక
సోమవారం 06-04-2026

# సీతక్కభరోసా... ఆ కుటుంబానికి ఆసరా..!!


- సమ్మక్కపూజారి కుటుంబం బాధనుతెల్సుకుని పూర్తివైద్యం
- అన్నివిధాల ఆధుకుంటానని
- కుటుంబ సభ్యులకు భరోసా..
- ఈసంఘటన బాధకరమనె..

10









# కొండకోనల మధ్య అంగరంగ వైభవంగా బీరమయ్య జాతర

2





## మూడు రాష్ట్రాల నుండి తరలివచ్చిన భక్తులు

- మూడు రోజులపాటు కోలాహలంగా ఉత్సవాలు
- గిరిజన సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం బీరమయ్య జాతర
- కోళ్లు, మేకల నైవేద్యాలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

వెంకటాపురం,ఏప్రిల్ 5,(డిడి9 వార్త)

తెలంగాణ–ఛత్తీస్ గఢ్ సరిహద్దులోని అటవీ ప్రాంతం డోలు వాయిద్యాలతో మారు మోగిపోతోంది. గిరిజనుల ఆరాధ్య దైవంగా ప్రసిద్ధి చెందిన బీరమయ్య జాతర తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం గ్రామానికి అతి సమీపంలో లొటపేట గండి వద్ద అంగరంగ వైభవంగా ప్రారంభమై ప్రకృతి ఒడిలో ఆధ్యాత్మిక కాంతిని విరజిమ్ముతోంది. ఎత్తైన కొండలు, పచ్చని అడవులు, పక్షుల కిలకిలారావాలు, మధ్యలో నెమ్మదిగా ప్రవహిస్తున్న గోదావరి నది ఈ అందాల నడుమ బీరమయ్య జాతర ఎంతో కోలాహలంగా సాగుతుంది

# ఆక్రమణదారులతో గోల

- శంకుస్థాపన అయి ఎనిమిది నెలలు పూర్తి.. యజమానుల సహకారం లేక అసంపూర్తి
- మూడు దశాబ్దాల కల నెరవేరే వేళ.. రోడ్డు ఆక్రమణల గోల
- ప్రజాపాలన ప్రభుత్వంలోనే ఇలా.. ప్రజలే అభివృద్ధికి మోకాలడ్డితే ఎలా?

11



# మేడారంలో కనీస సౌకర్యాలు కరువు

- మండుటెండల్లో భక్తుల కష్టాలు
- తాగునీటి కోసం అలమటిస్తున్న వైనం
- పారిశుద్ధ్యం లోపంతో అవస్థలు
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

7









## కొండకోనల మధ్య

# అంగరంగ వైభవంగా బీరమయ్య జాతర





### మూడు రాష్ట్రాల నుండి తరలివచ్చిన భక్తులు

**తెలంగాణ–ఛత్తీస్ గఢ్ సరిహద్దులోని అటవీ ప్రాంతం డోలు వాయిద్యాలతో మారు మోగిపోతోంది. గిరిజనుల ఆరాధ్య దైవంగా ప్రసిద్ధి చెందిన బీరమయ్య జాతర తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం గ్రామానికి అతి సమీపంలో లొటపేట గండి వద్ద అంగరంగ వైభవంగా ప్రారంభమై ప్రకృతి ఒడిలో ఆధ్యాత్మిక కాంతిని విరజిమ్ముతోంది. ఎత్తైన కొండలు, పచ్చని అడవులు, పక్షుల కిలకిలారావాలు, మధ్యలో నెమ్మదిగా ప్రవహిస్తున్న గోదావరి నది ఈ అందాల నడుమ బీరమయ్య జాతర ఎంతో కోలాహలంగా సాగుతుంది**

- **మూడు రోజులపాటు కోలాహలంగా ఉత్సవాలు**
- **గిరిజన సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం బీరమయ్య జాతర**
- **కోళ్లు, మేకల నైవేద్యాలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు**

**వెంకటాపురం,ఏప్రిల్ 5,(డిడి9 వార్త)**

బీరమయ్య జాతరకు తెలంగాణతో పాటు ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తున్నారు. టేకులగూడెం, కృష్ణాపురం గ్రామాల ప్రజలు యాలం అచ్చయ్య అధ్యక్షతన మూడు రోజులపాటు ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వ హిస్తున్నారు. ప్రాంతమంతా పండుగ వాతావ రణంతో కళకళలాడుతోంది.

బీరమయ్య గిరిజనుల జీవన విధానంలో అంతర్భాగం. బీరమయ్యను అడవులు, జలవ నరులను కాపాడే శక్తిగా భావిస్తారు. గ్రామాల్లో వ్యాధులు, కష్టాలు, ప్రకృతి విపత్తులు దరిచేరకుండా కాపాడే దైవంగా ఆయనను విశ్వసిస్తారు. ఈ విశ్వాసమే ప్రతి ఏడాది జాతర రూపంలో వ్యక్తమవుతూ తరత రాలకు కొనసాగుతోంది.

జాతరలో గిరిజన సంస్కృతి తన అసలైన రూపంలో ప్రతిబింబిస్తుంది. డోలు నాదాలు అడవుల్లో మార్మోగుతుంటే, వాయిద్యాల స్వరాలు భక్తి రాగాలుగా వినిపిస్తాయి. సంప్రదాయ దుస్తుల్లో గిరిజనులు చేసే నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కోళ్లు, మేకలు వంటి నైవేద్యాలతో భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటూ దేవుడిని ప్రసన్నం చేసుకుంటారు.



లొటపేట గండి ప్రాంతం ప్రకృతి సోయగాలతో అలరారుతుంది. ఎత్తైన కొండల మధ్య, అడవుల లోతుల్లో, గోదావరి ప్రవాహం పక్కనే జరిగే ఈ జాతర భక్తులకు ఒక ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుంది. పక్షుల కిలకిలారావాలు, గాలిలో తేలే ఆకుల సవ్వడులు, భక్తుల రద్దీ అన్నీ కలిపి ఒక ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టిస్తాయి.

పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలు ఈ జాతరలో సజీవంగా కనిపిస్తాయి. ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, గ్రామ పెద్దల ఆశీర్వాదాలు గిరిజన సంస్కృతికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తాయి. ఈ జాతర కేవలం పూజాకార్యక్రమం మాత్రమే కాదు, గిరిజనుల జీవన విధానం, వారి సంప్ర దాయాలకు ప్రతిబింబం.ఏడాదికి ఒకసారి జరిగే బీరమయ్య జాతర గిరిజనుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు మాత్రమే కాకుండా ప్రకృతి–మనిషి అనుబంధానికి కూడా ప్రతీకగా నిలుస్తోంది. ఆధునిక ప్రపంచంలో మరిచిపోతున్న సంప్రదాయాలను గుర్తు చేస్తూ, ప్రకృతితో సమన్వయం అవసరాన్ని తెలియజేస్తోంది. భక్తి, సంప్రదాయం, ప్రకృతి అన్నీ కలిసిన ఈ జాతర ప్రతి ఏడాది మరింత వైభవంగా కొనసా గుతోంది.







# జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి


**జనగామ ఏప్రిల్ 5 (డిడి 9వార్త ) బ్యూరో**

దళితుల సమగ్రాభివృద్ధికి డా. బీఆర్. అంబేద్కర్, డా. బాబు జగ్జీవన్ రామ్ ఇద్దరూ రెండు కళ్లలాంటి వారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కస్టేషన్ ఘనపూర్ లో నిర్వహించిన జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి బడుగు వర్గాలకు హక్కులు కల్పించగా, ఆ రాజ్యాంగం అమలుకు జగ్జీవన్ రామ్ విశేషంగా కృషి చేశారని తెలిపారు. దళిత విద్యాభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను ప్రారంభించారని, పేదల కోసం రేషన్ విధానాన్ని తీసుకువచ్చిన నాయకుడు కూడా జగ్జీవన్ రామ్ అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న విగ్రహం శిథిలావస్థలో ఉందని, దాని స్థానంలో 2027 ఏప్రిల్ 5 నాటికి కొత్త కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే అంబేద్కర్, జగ్జీవన్ రామ్ పేరుతో రూ.2 కోట్లతో ఆధునిక భవనాన్ని నిర్మిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూలు కుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మణ్ బాబు పై విమర్శలకు అర్హత ఇర్సవడ్ల వెంకన్నకు లేదు: తాటి కృష్ణ హెచ్చరిక

- **ఆదివాసి బాలుడి పరామర్శపై రాజకీయ రంగు: కాంగ్రెస్‌పై తాటి కృష్ణ ఫైర్**
- **లక్ష్మణ్ బాబుపై తప్పుడు ప్రచారం చేస్తే సహించం: వెంకన్నకు స్ట్రాంగ్ వార్నింగ్**
- **మేడారం అవినీతి ఆరోపణలపై సిట్టింగ్ జడ్జి విచారణకు డిమాండ్**
- **సహాయం చేసిన నాయకుడిపై విమర్శలు సరికాదు: కాంగ్రెస్ వైఖరిపై మండిపాటు**

**మంగపేట, ఏప్రిల్05డీడీ 9 వార్త**



ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పై విమర్శలు చేయడానికి కాంగ్రెస్ నాయకుడు ఇరుసవడ్ల వెంకన్నకు అర్హత లేదని, తక్షణమే తప్పుడు ప్రచారాన్ని నిలిపివేయాలని బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా నాయకులు తాటి కృష్ణ హెచ్చరించారు.

ఆదివాసి బాలుడిని పరామర్శించిన అంశాన్ని కూడా రాజకీయంగా మలచడం కాంగ్రెస్ నాయకుల వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు. మేడారం ప్రాంతానికి చెందిన పూజారి రానా రమేష్ కుమారుడు యావన్ ప్రమాదంలో కాలు కోల్పోయిన నేపథ్యంలో, అతడిని పరామర్శించడానికి వెళ్లిన లక్ష్మణ్ బాబు చర్యను తప్పుగా చూపించడం సరికాదన్నారు.

సంఘటన జరిగిన తర్వాత కూడా సంబంధిత మంత్రి సీతక్క, కాంగ్రెస్ నాయకులు ఎందుకు ఆ బాలుడిని పరామర్శించలేదో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ఆ కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు, దానికి సంబంధించిన జీఓను చూపగలరా అని సవాల్ విసిరారు.

మేడారం విషయంలో అవినీతి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, ఎటువంటి అవినీతి జరగకపోతే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తాటి కృష్ణ డిమాండ్ చేశారు.

ఇరుసవడ్ల వెంకన్న సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ, లక్ష్మణ్ బాబు పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ ఆరోపణలను నిరూపించలేకపోతే ప్రజల ముందు నిలబడలేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

లక్ష్మణ్ బాబు ప్రజలతో కలిసిమెలిసి ఉండే నాయకుడని, పేదలు, బడుగు బలహీన వర్గాలు, ఆదివాసీలకు అండగా నిలిచిన వ్యక్తిగా పేరు పొందారని పేర్కొన్నారు. ఆయనపై అవినీతి ఆరోపణలు చేయడం దురుద్దేశపూరితమని అన్నారు.

ఇకపై లక్ష్మణ్ బాబు గురించి తప్పుడు ప్రచారం చేస్తే సహించబోమని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని తాటి కృష్ణ డిమాండ్ చేశారు. ప్రజలకు సేవ చేయడం మానేసి చౌకబారు విమర్శలు చేయొద్దని కాంగ్రెస్ నాయకులకు సూచించారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

- **కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆంజనేయులు గౌడ్**
- **కొత్తూరులో మండల్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు**
- **సొంత ఖర్చులతో క్రీడాకారులకు విన్నర్ కప్,ప్రైజ్ మనీ 15,000/- వేల రూపాయలు అందజేసిన ఆంజనేయులు గౌడ్**
- **రన్నర్ ప్రైజ్ మనీ 10,000/- వేల రూపాయలు అందజేసిన ఎర్రవెల్లి నవీన్ చారి**

**కొత్తూర్ ఏప్రిల్ 05 ( డిడి 9 వార్త ప్రతినిధి )**




క్రీడలు ప్రతినిత్యం ఆడడంవల్ల శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆంజనేయులు గౌడ్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన కొత్తూరు మండలంలో మండల్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ నేటితో ముగిసింది.గెలుపొందిన క్రీడాకారులకు సొంత నిధులతో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆంజనేయులు గౌడ్ విన్నర్ కప్,ప్రైజ్ మనీ 15,000/ రన్నర్ ప్రైజ్ మనీ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఎర్రవెల్లి నవీన్ చారి 10,000/ వేల రూపాయలతో పాటు షీల్డ్ లను మాజీ ఎంపీపీ వేణుగోపాల్ గౌడ్ చేతుల మీదగా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు.పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు.ఆటల్లో గెలుపోటలములు పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇందూరి శ్రీకాంత్,విక్రమ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# మైత్రి వెంకటరెడ్డి సేవలు మరువలేనివి

- **జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి...**
- **మైత్రి కి ఘన సన్మానం...**

**మంగపేట ఏప్రిల్ 05డీడీ 9 వార్త**

మైత్రి వెంకటరెడ్డి సేవలు మరువలేనివని జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన సానికొమ్ము వెంకటరెడ్డి (మైత్రి వెంకటరెడ్డి) ని ఆదివారం జిల్లా సరిహద్దు గ్రామమైన మండలంలోని అకినేపల్లి మల్లారం గ్రామంలో వికాస్ అగ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ మైత్రి వెంకటరెడ్డి ఎన్నో సంస్థలు నెలకొల్పి ఎంతో మందికి జీవనోపాధి కల్పించడమే కాకుండా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వెంకట్ రెడ్డి సేవలను కొనియాడారు భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు ఈ ప్రాంతానికి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవి రావడం హర్షనీయమన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక ఫర్టిలైజర్ డీలర్లు కన్నెగంటి దుర్గాప్రసాద్ గాదంశెట్టి సుబ్రహ్మణ్యం దాట్ల శ్రీనివాసరాజు గోపి పచ్చిపులుసు నరేష్ బండారి రాంబాబు గంటా రవీందర్ రెడ్డి స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



# బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్

- **కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్**
- **హాజరైన మాజీ ఎంపీపీ జాండగూడెం వేణుగోపాల్ గౌడ్**
- **కొత్తూరులో ఘనంగా జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు**

**కొత్తూరు 5 ఏప్రిల్ డిడి 9 వార్తా ప్రతినిధి**

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్ అన్నారు. ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల కోసం బాబు జగ్జీవన్‌రామ్ నిరంతరం కృషి చేశారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జండగూడెం వేణుగోపాల్ గౌడ్,కౌన్సిలర్ వీరమోని హేమ దేవేందర్ ముదిరాజ్,కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్, సీనియర్ నాయకులు పీర్లగూడెం మహేష్ గౌడ్,పెద్దిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్,చిలకమర్రి నరసింహ, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ కోశాధికారి చింత సాయి తేజేశ్వర్,యువ నాయకులు కొండారెడ్డి సుమన్, నరసింహ గౌడ్,రాజు యాదవ్,అనిల్,యాది, తదితరులు పాల్గొన్నారు.



# జగ్జీవన్ రామ్ ఆశయాలే స్ఫూర్తిగా పనిచేయాలి

**భూపాలపల్లి ఏప్రిల్ 5 ( డిడి 9వార్త )**

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను స్ఫూర్తి గా తీసుకుని నేటి యువత పని చేయాలని ఎస్పీ సంకీర్త్ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఆదివారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు, సంఘ సంస్కర్త, సామాజిక చైతన్యానికి ప్రతీక, భారత మాజీ ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. సమానత్వం, సామాజిక న్యాయం సాధన కోసం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం దేశానికి శాశ్వత ప్రేరణగా నిలిచిందని తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి అపారమని, ఆయన ఆలోచనలు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో సమానత్వం, న్యాయం స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్,ఆర్ఐ అడ్మిన్ రత్నం,స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

---

# పట్టణ ప్రజలకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపిన ఉప సర్పంచ్..

- **మరనాత బైబిల్ మిషన్ వారి ఆధ్వర్యంలో ఘనంగా ఈస్టర్ వేడుకలు..**



**మణుగూరు.ఏప్రిల్ 5 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం,సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలో గల అశోక్ నగర్ ప్రాంతంలోని మరనాత బైబిల్ మిషన్ ప్రార్థనమందిరం వారు ఆదివారం నాడు ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు సమితి సింగారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ ఆత్మీయ అతిథిగా విచ్చేసి తమ అమూల్యమైన సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ,క్షమాగుణం కలిగి ఉండాలని ప్రపంచానికి సందేశాన్నిచ్చిన ఏసుక్రీస్తు ప్రభువు సమాధి నుండి తిరిగివచ్చిన పర్వదినం ఈస్టర్ అని, ఈ పర్వదినం అందరూ సుఖశాంతులతో,ప్రేమానురాగాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మణుగూరు మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ బి. విజ్ఞాన్ రావు మాట్లాడుతూ.. ప్రేమ,శాంతి, క్షమ అనే విలువలను మనందరం ఆచరించాలి అనే సందేశాన్ని ఈస్టర్ మనకు అందిస్తుందని, ఈ ఈస్టర్ పర్వదినం మనందరి జీవితాల్లో ఆరోగ్యం,ఐశ్వర్యం తీసుకురావాలని ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బి. విజ్ఞాన్ రావు, సంధ్య మరియు సంఘ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

---





# సిద్ధాపూర్‌లో ఘనంగా "హిందూ సమ్మేళనం"

- **హిందూ సమాజ శక్తి,సంస్కృతి పరిరక్షణే లక్ష్యం -అందే బాబన్న సందేశం**

**కొత్తూరు 5 ఏప్రిల్ డిడి 9**

**వార్తా ప్రతినిధి**

సిద్ధాపూర్‌లో హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో షాద్నగర్ బిజెపి ఇన్చార్జ్ అందే బాబన్న పాల్గొని హిందూ సమాజ ఐక్యత, సాంప్రదాయ విలువల పరిరక్షణ ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.ఈ సమాజంలో ఐక్యత, సాంస్కృతిక పరిరక్షణతో పాటు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హిందూ ధర్మం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ గౌడ్, మణికరణ్ కొత్తూరు మండల్ మాజీ అధ్యక్షులు, నాగరాజ్ కొత్తూరు మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు, పెద్ద ఎత్తున భక్తులు, స్థానిక ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

---

## ఆదివారం నాడు పలు శుభకార్యక్రమాల్లో పాల్గొన్న

# ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..


**మణుగూరు.ఏప్రిల్ 5 (డి డి 9వార్త)**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడి వివాహానంతర వేడుక (రిసెప్షన్) లో పినపాక నియోజక వర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఆదివారం నాడు ఖమ్మం లోని వైఎస్ఆర్ కాలనీ రోడ్ గ్రీన్ హిల్స్ లో పెళ్లి రిసెప్షన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలను తెలియచేశారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.

అనంతరం జరిగిన మరో కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య గారి మనవడు పుట్టినరోజు,అన్నప్రాసన మరియు మనవరాలు చెవులుకుట్టే వేడుకలో పాల్గొన్నారు. ఇల్లందు లోని సమ్మక్క సారలమ్మ గుడి వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్నారులు ఆరోగ్యంగా,ఆనందంగా ఎదగాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



---

# చిరుతపల్లి 1 ఆశ్రమ బాలికల పాఠశాలను గురుకులం చేయాలి

**ఏప్రిల్ 05 డిడి9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురం చిరుతపల్లి 1 గిరిజన ఆశ్రమ పాఠశాలను గురుకులంగా చేయాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం కొమరం భీమ్ కాలనిలో ఆదివాసులతో సమావేశమై ఈ సందర్భంగా పూనెం సాయి దొర మాట్లాడుతూ. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం కేంద్రంగా చిరుతపల్లి ఆశ్రమ పాఠశాలను గురుకులం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఉన్నత చదువులు చదవలేక చాలామంది ఆదివాసి బిడ్డలు విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఎక్కువ ఆదివాసులు ఉంటారు కాబట్టి వారు పదవ తరగతికి పరిమితం అవుతున్నారని, ఇంటర్మీడియట్ గురుకులం చేస్తే ఆదివాసీ బిడ్డలకు ఉన్నత విద్యకు తోడ్పాటుగా ఉంటుందని అన్నారు. ఆదివాసి విద్యార్థుల భవిష్యత్తుని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని వెంకటాపురం చిరుతపల్లి 1గిరిజన ఆశ్రమ



పాఠశాలను తక్షణమే గురుకులంగా ప్రకటించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఆదివాసి విద్యార్థులు పై చేయిగా నిలవాలని ఆయన కోరారు .ఈ సమావేశంలో తాటి లక్మయ్య. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు నందమూరి సేవాసమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం..

- **ప్రారంభించిన నందమూరి సేవాసమితి అధ్యక్షుడు వీరపనేని చెన్నకేశవులు.**



**మణుగూరు.ఏప్రిల్ 5 (డి డి 9వార్త)**

నందమూరి సేవాసమితి మణుగూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం నాడు మణుగూరు పట్టణంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలో గల అశోక్ నగర్ టెలిఫోన్ ఎక్స్చేంజ్ సెంటర్ వద్ద చలివేంద్రం ను ఏర్పాటు చేశారు. మణుగూరు నందమూరి సేవాసమితి అధ్యక్షులు వీరపనేని చెన్నకేశవులు ఈ చలివెంద్రాన్ని ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి ఎండల దృష్ట్యా బాటసారులు,ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గత పది రోజులుగా వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ప్రజలు వేసవి తాపానికి తల్లడిల్లుతున్నారని, ఈ ప్రధాన రహదారి గుండా వెళ్ళే ప్రయాణికులు,కార్మికులు, విద్యార్థులు దహార్తితో ఇబ్బందులు పడకుండా ఈ చలివెంద్రాన్ని ఏర్పాటు చేసి మంచినీరు అందిస్తున్నామని ఆయన తెలిపారు.పట్టణాల్లో ప్రజల దాహార్తి నిమిత్తం ప్రధాన కూడళ్లలో చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ,స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నందమూరి సేవాసమితి సభ్యులు, మరియు అభిమానులు పాల్వాయి సుధాకర్, అసిరి నాయుడు,మేదరమెట్ల శ్రీనివాసరావు,వెల మాటి పూర్ణ,ధారపునేని హరి, కర్ల వెంకన్న, తాత ప్రసాద్,వల్లభనేని రమణ,కొర్రపాటి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.





# డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఘన నివాళులు

- **సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం**
- **అసెంబ్లీ సభాపతి గండం ప్రసాద్,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,ఏప్రిల్ 5 డిడి 9 వార్త**

సామాజిక న్యాయం,సమానత్వం కోసం భారతదేశ మాజీ ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్ రామ్ చేసిన కృషి దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పలువురు రాజకీయ నాయకులు పేర్కొన్నారు. డాక్టర్.బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ ఎక్స్‌టెన్షన్ చౌరస్తా,అలాగే ఆరాంఘర్ చౌరస్తా వద్ద గల ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి గౌరవ నివాళి అర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు.రాష్ట్ర అసెంబ్లీ సభాపతి గండం ప్రసాద్,స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,మాజీ శాసనమండలి చైర్మన్ కనకమామిడి స్వామి గౌడ్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే.ఎస్. రత్నం, బారసా నియోజకవర్గ ఇన్చార్జ్ పి.కార్తిక్ రెడ్డి, పలువురు నాయకులు బుద్వేల్ గ్రామస్థులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద కుటుంబంలో జన్మించినప్పటికీ తన ప్రతిభతో దేశ రాజకీయాల్లో ఉన్నత స్థానానికి ఎదిగిన డా. బాబు జగ్జీవన్ రామ్ దేశానికి అపార సేవలు అందించారని పేర్కొన్నారు. ఉప ప్రధాన మంత్రిగా సుదీర్ఘకాలం సేవలందిస్తూ అనేక కీలక శాఖలను సమర్థవంతంగా నిర్వహించారని గుర్తుచేశారు.అదేవిధంగా, కష్టకాలాల్లోనూ దేశానికి అండగా నిలిచి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన మహానేతగా ఆయన నిలిచారని కొనియాడారు.ఆయన ఆశయాలు,సిద్ధాంతాలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని,వాటిని ఆచరణలో పెట్టడం సమాజం ముందున్న బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహనీయుల జయంతుల ఉత్సవాల కమిటీ సభ్యులు, బుద్వేల్ అరుంధతి సంక్షేమ సంఘం సభ్యులు,స్థానిక ప్రజలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

# బుద్వేల్‌లో హిందూ సమ్మేళనం నిర్వహణకు విస్తృత సన్నాహాలు

- **సమితికి అధ్యక్షుడిగా భాశెట్టి కుమార్,ప్రధాన కార్యదర్శిగా కుక్కునూరి శ్రీనివాస్ గౌడ్**



**రాజేంద్రనగర్ ఏప్రిల్ 05 డిడి 9 వార్త**

రాజేంద్రనగర్ మండలం పరిధిలోని బుద్వేల్ గ్రామంలో హిందూ సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడం,కుల,ప్రాంత, రాజకీయ భేదాలకు అతీతంగా సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడం, సనాతన ధర్మం,భారతీయ సంస్కృతి,దేశభక్తి విలువల పట్ల అవగాహన పెంపొందించడం లక్ష్యంగా హిందూ సమ్మేళనం నిర్వహించేందుకు నిర్వాహకులు విస్తృత సన్నాహాలు చేస్తున్నారు.

ఈ సమ్మేళనం విజయవంతం చేయడానికి స్థానిక ప్రముఖులు, యువ నాయకుల సమన్వయంతో ప్రత్యేక నిర్వహణ సమితిని ఏర్పాటు చేశారు.ఈ సమితికి అధ్యక్షుడిగా భాశెట్టి కుమార్, ప్రధాన కార్యదర్శిగా కుక్కునూరి శ్రీనివాస్ గౌడ్ బాధ్యతలు స్వీకరించి కార్యక్రమ నిర్వహణపై దృష్టి సారిస్తున్నారు. సమ్మేళనం ప్రతి విభాగంలో సమర్థవంతంగా జరగడానికి వివిధ ఉప సమితులను ఏర్పాటు చేసి బాధ్యతలను విభజించారు.

మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు మహిళా సమితి,సాంస్కృతిక కార్యక్రమాలు మరియు క్రీడా పోటీల నిర్వహణ కోసం సాంస్కృతిక మరియు క్రీడా సమితి,కార్యక్రమానికి అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణ కోసం నిధి సేకరణ సమితి,అతిథుల స్వాగతం కోసం స్వాగత సమితి, కార్యక్రమ ప్రచారం కోసం ప్రచార సమితి,మీడియా సమన్వయం కోసం మీడియా సమితి,అలాగే కార్యక్రమ నిర్వహణలో సహకరించేందుకు స్వచ్ఛంద సేవకుల సమితిని ఏర్పాటు చేశారు.ఈ హిందూ సమ్మేళనం ఈ నెల 19వ తేదీ ఆదివారం బుద్వేల్ గ్రామంలోని శ్రీ శివాంజనేయ దేవాలయం ప్రాంగణంలో సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఘనంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సమాజ చైతన్యాన్ని పెంపొందించే వివిధ అంశాలు చోటు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.స్థానిక ప్రజలు, యువత,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు. సమాజంలో ఐక్యత,పరస్పర సహకారం,సాంప్రదాయ విలువల పరిరక్షణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆరోగ్య వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**డిడి9 వార్త ములుగు పట్టణం**

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆరోగ్య వారోత్సవాల నిర్వహణకు సంబంధించి సంబంధిత విభాగాల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశాన్ని నిర్వ హించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో ఆరోగ్య వారోత్సవాల ను పురస్కరించుకొని వారం రోజులపాటు ఆరోగ్యానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 6 వ తేదీన న ఫుడ్ సేఫ్టీ ఆహార భద్రతపై దృష్టి పెట్టి ఆహార కల్తీ వల్ల వచ్చే జబ్బుల గురించి అవగాహన కలిగించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి డి ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ వరకు రైట్ వాక్ తినండి నిర్వహించాలన్నారు 7వ తేదీన న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించాలన్నారు 8వ తేదీ న సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా వర్క్ షాప్ నిర్వహిం చాలని సూచించారు. 9వ తేదీ న ఎయిడ్స్ అవేర్నెస్ రెడ్ రన్ వాక్ నిర్వహించి అవగాహన కార్యక్రమం చేపట్టాలన్నారు.10 వ తేదీ న హోమియోపతి అండ్ ఆయుష్ డే సందర్భంగా జిల్లా కేంద్రం లోని గిరిజన భవనంలో యోగా డిమానిస్ట్రేషన్ క్యాంపు నిర్వహించాలని పేర్కొన్నారు 11వ తేదీన డ్రగ్ నియంత్రణ విభాగం ద్వారా ప్రజలకు మందుల వినియోగం పై అవగాహన, డ్రగ్ అబ్యూస్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాన్నారు. వారం రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలకు సంబంధించిన వివిధ అంశాలను వివిధ విభాగాల బాధ్యతలను డిఎంహెచ్ఓ వివరించారు వైద్యులు నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ఆరోగ్య వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, డిఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్ రావు, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్ డి ఎస్ పి డిపిఓ వెంకయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# నియోజకవర్గ స్థాయి ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభం

- **ఢిల్లీ తరహా పాలన, పథకాలు అమలు చేస్తాం**
- **ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పుల్లయ్య**

**బోనకల్,ఏప్రిల్ 05,(డీడీ9 వార్త):**

ఆమ్ ఆద్మీ పార్టీ మధిర నియోజకవర్గ ఇంచార్జ్,ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పుల్లయ్య ఆధ్వర్యంలో మండల పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగిందీ.ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని పుల్లయ్య తెలిపారు, కేజ్రీవాల్ ఢిల్లీలో అమలు చేసిన పథకాలను తెలంగాణలో కూడా అమలు చేసే విధంగా ఆ తరహా ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తామని పార్టీ నాయకులు ప్రజలకు తెలియ చేశారు,మొదటి రోజు సుమారుగా 150 మంది తమ సభ్యత్వాన్ని నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.ఆప్ ఖమ్మం జిల్లా కన్వీనర్ స్వర్ణ సుబ్బారావు, కో కన్వీనర్ పసుమర్తి శ్రీనివాస్,జనరల్ సెక్రటరీ గంధం పుల్లయ్య, జాయింట్ సెక్రటరీ పి.నరసింహ రావు,ట్రెజరర్ కనకపుడి రవి కుమార్ పాల్గొన్నారు.



# డా. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఘనంగా నిర్వహణ

**గోవిందరావుపేట, ఏప్రిల్ 5 (డి డి 9 వార్త )**

ఆదివారం పసర గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు మడిపల్లి శ్యాంబాబు మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి పసర మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య సుమలత, ఎం ఎస్ పి జాతీయ నాయకుడు ఇరుగుపైడి మాదిగ ముఖ్య అతిథులుగా హాజరై, డా. బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం నాయకులు మాట్లాడుతూ మహానేత బాబు జగ్జీవన్ రామ్ ని స్మరించుకుంటూ దేశ ప్రజలందరికీ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరంలోనూ, సామాజిక సమానత్వ సాధనలోనూ, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడని కొనియాడారు.

అర్ధ శతాబ్దానికి పైగా పార్లమెంట్ సభ్యుడిగా సేవలందించి, కేంద్ర కేబినెట్‌లో కీలక బాధ్యతలు నిర్వహించిన రాజకీయ దూరదృష్టి గల నాయకుడిగా ఆయనను అభివర్ణించారు. అట్టడుగు వర్గంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి దేశ రాజకీయాల్లో అగ్రగామిగా నిలిచిన వ్యక్తి అని పేర్కొన్నారు.

ఇప్పటికీ బాబు జగ్జీవన్ రామ్ కి భారతరత్న పురస్కారం ప్రకటించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఎమ్మార్పీఎస్ తరపున తక్షణమే భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు.





# బుద్వేల్‌లో ఘనంగా ఈస్టర్ వేడుకలు

- **ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్ ఏప్రిల్ 05 డిడి 9 వార్త**

నియోజకవర్గ పరిధిలోని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయం పక్కనున్న ఈస్టర్ హిల్స్ లో ఈస్టర్ పండుగ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. క్రైస్తవ సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో చర్చిలకు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని యేసుక్రీస్తు పునరుత్థానాన్ని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా బుద్వేల్‌లోని చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే రత్నం కూడా హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు.చర్చి ప్రతినిధులు,పాస్టర్లు సంప్రదాయ పద్ధతుల్లో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. ఈస్టర్ పండుగ ప్రేమ,క్షమ, త్యాగం,పునరుత్థానం వంటి ఉన్నత విలువలను గుర్తుచేసే పవిత్ర సందర్భంగా పేర్కొన్నారు.యేసుక్రీస్తు చూపిన మార్గం మానవాళికి ఆశ,శాంతి,సౌభ్రాతృత్వానికి ప్రతీక అని తెలిపారు.ప్రతి ఒక్కరూ ప్రేమ,కరుణ, సేవాభావంతో జీవించాలని, సమాజంలో ఐక్యతను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈస్టర్ సందర్భంగా సమాజంలో శాంతి,సౌహార్ద వాతావరణం నెలకొనాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు ,చర్చి నిర్వాహకులు,విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనల్లో భాగమయ్యారు.

# బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

- **మహనీయుల ఆశయాలను తూచా తప్పకుండా పాటించాలి.**
- **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**డి డి 9 వార్త ములుగు టౌన్**

ములుగు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 జయంతి ఉత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులు అర్పించారు జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గొప్ప సమతవాది, కార్మిక చట్టాల ఆద్యుడు గా దేశానికి చేసిన సేవలను ఆయన చేసిన కృషిని కొనియాడారు ఆయన ప్రస్థానం భావితరాలకు ఎంతో స్ఫూర్తి గా నిలుస్తుందని తెలిపారు. మహానుభావుల ఆశలను నిరంతరం చిత్తశుద్ధితో పాటిస్తూ వాటి అమలు కోసం కృషి కృషి చేయడం ద్వారానే వారికి నిజమైన కీర్తి ఘటించినట్టు అవుతుందన్నారు భారత దేశ సామాజిక, రాజకీయ చరిత్రలో అలుపెరుగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తిగా,అతి చిన్న వయసులోనే కేంద్ర మంత్రిగా పదవీ



బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారని తెలిపారు కేంద్ర కార్మిక మంత్రిగా అనేక కార్మిక సంక్షేమ విధానాలకు ఎంతగానో కృషి చేశారని అన్నారు ఈ సంద ర్భంగా ములుగు మునిసిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పల చంద్రకళ మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన కృషిని గుర్తు చేస్తూ వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ ముందుకు సాగాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపాలిటీ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, షెడ్యూల్ కులాల అధికారి కొమురయ్య, తాహసిల్దార్ విజయ భాస్కర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో... క్రీస్తు పునరుద్ధాన సువార్త

- **సమాధిని గెలిచాడు గీతాలతో**
- **భారీగా ర్యాలీ నిర్వహించిన క్రైస్తవులు**

**చింతకాని,ఏప్రిల్ 02,(డీడీ9 వార్త):**

చింతకాని మండల కేంద్రంలోని క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో క్రీస్తు పునరుద్ధాన సువార్తను ఆదివారం తెల్లవారుజామున క్రీస్తు చనిపోయి మూడవ రోజున తిరిగి లేచాడని చింతకాని మండలం కేంద్రంలోని వీధి,వీధి తిరుగుతూ ఏసు క్రీస్తు మనుషుల పాపలు తూడ్చి వేయటానికి, పాపుల నిమిత్తం కల్వరి సిలువలో రక్తం చిందించి ప్రాణం పెట్టి, మరణించి తిరిగి మూడవ రోజున లేవడం పునరుద్ధానం మరణం పై విజయం అని మానవులు కూడా మరణించిన తర్వాత తిరిగి లేస్తారు అని గుర్తుగా ఈస్టర్ ను ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని ప్రపంచంలో యేసు క్రీస్తు వారు ఒక్కరే తిరిగి లేచారని, క్రీస్తు మరణ రాజ్యసవార్తను ప్రజలకు వివరిస్తూ.. భారీ ర్యాలీగా సువార్త చేసి, ప్రతి ఒక్కరికి ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో....పాస్టర్స్ క్రైస్ట్ చర్చ్ వేముల ఆకాష్, జంగాల ప్రకాష్‌బాబు,బైబిల్ మిషన్ విజయరత్నం, విశ్వవాణి విజయ్ కుమార్,సీ ఎస్ఐ సుందర్ కాంత్, మిస్పా పాస్టర్ రాజేష్, క్రీస్తు సంఘం దావీద్, రవీంద్రబాబు, క్రైస్ట్ చర్చ్ సంఘ పెద్దలు వేముల శ్రీనివాసరావు, తలారి లక్ష్మీనారాయణ,వెర్పుల అనిల్ కుమార్, గుండెపోగు నరేష్,గంటెల కిరణ్,వేముల కిషోర్,తలారి గోపి, అన్ని సంఘల సభ్యులు, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థ సి ఎం డి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి చొరవ..

- **సింగరేణి కార్మికుల సహజ మరణానికి పది లక్షల రూపాయల ఉచిత భీమా..**
- **హర్షం వ్యక్తం చేసిన మణుగూరు ఏరియా టి బి జి కె ఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.**




**మణుగూరు.ఏప్రిల్ 5 (డి డి 9వార్త)**

సింగరేణి కార్మికుల సంక్షేమం పై సింగరేణి చైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ద ప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ పర్సనల్ మరియు ఫైనాన్స్ గౌతం పోట్రూ ప్రత్యేక చొరవ చూపడం సంతోషకరమైన అంశమని మణుగూరు ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు తెలిపారు. సింగరేణి సంస్థ లో పనిచేసే కార్మికులు సహజ మరణం పొందితే ఆ కుటుంబానికి ఆసరాగా 10 లక్షల రూపాయలు ఉచిత భీమా పథకం అమలు చేసే విధంగా యూనియన్ బ్యాంక్ వాళ్ళతో ఒప్పందం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ బ్యాంకు లో కార్పొరేట్ శాలరీ అకౌంట్ కలిగిన వారికి ఈ బీమా పథకం ఏప్రియల్ 01 నుంచి వర్తించే విదంగా నిర్ణయం చేయడం కార్మిక కుటుంబాలకు ఎంతో భరోసా ఇస్తుందని ఆయన తెలియ చేశారు. సి యం. డి, డైరెక్టర్ (పా), తీసుకున్న నిర్ణయం పట్ల కార్మిక వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలియ చేశారు. కేసీఆర్ పాలన టి బి జి కె యస్ గుర్తింపు కార్మిక సంఘం గా ఉన్న సమయంలో టి బి జి కె యస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ప్రత్యేక చొరవ మేరకు సింగరేణి లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారితో మొదటి సారిగా భీమా ఒప్పంద పథకం కు శ్రీకారం చుట్టడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కార్మిక కుటుంబాల శ్రేయస్సు ను దృష్టిలో ఉంచుకొని ఆనాడు టి బి జి కె యస్ చేసిన భీమా ఒప్పందాలు నేడు కార్మిక కుటుంబాల్లో వెలుగులు ప్రసాదిస్తున్నాయని ఆయన తెలియచేశారు. ఎలాంటి రుసుము లేకుండా యస్ బి ఐ బ్యాంక్ వారితో మొదటి సరిగా 20 లక్షల రూపాయల ప్రమాద బీమా ఒప్పందం చేయడం జరిగిందని ఆ తర్వాత భీమా పథకాన్ని 40 లక్షలకు పెంచడం జరిగిందని నేడు కోటి రూపాయలకు భీమా పథకం చేరిందని తెలిపారు.టి బి జి కె యస్ ఆనాడు యస్ బి ఐ బ్యాంక్ వారితో భీమా పథకం ఒప్పందం చేస్తే దానిని స్ఫూర్తిగా తీసుకొని యూనియన్ బ్యాంక్, ఐ సి ఐ సి ఐ, హెచ్ డీ ఎఫ్ సి, బరోడా లాంటి బ్యాంక్ సంస్థలు ముందుకు రావడం భీమా ఒప్పందాలు చేసుకొని కార్మిక కుటుంబాలకు అండగా నిలవడం సంతోషకరమైన అంశం అని తెలిపారు. కార్మిక సహజ మరణానికి 10 లక్షల రూపాయల ప్రమాద బీమా యూనియన్ బ్యాంక్ వారితో ఒప్పందం చేసిన యాజమాన్యం కోటి రూపాయలు ప్రమాద బీమా పథకం ఇచ్చే బ్యాంక్ అధికారులతో మాట్లాడి ఆ బ్యాంక్ వారు కూడా అమలు చేసే విధంగా చొరవ చూపాలని ఆయన తెలిపారు. సంస్థ ప్రగతి కోసం రేయింబవళ్లు కష్టపడి పనిచేసే కార్మికుల కష్టాన్ని గుర్తించి సహజ మరణ భీమా పథకం 10 లక్షల రూపాయలు ఒప్పందం చేసిన సింగరేణి సంస్థ చైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ద ప్రకాష్ జ్యోతికి, డైరెక్టర్ పా గౌతం పోట్రూ కు మరియు యూనియన్ బ్యాంక్ వారికి మణుగూరు ఏరియా టి బి జి కె యస్ తరుపున హృదయ పూర్వక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.

# మేడారంలో కనీస సౌకర్యాలు కరువు

- మండుటెండల్లో భక్తుల కష్టాలు
- తాగునీటి కోసం అలమటిస్తున్నవైనం
- పారిశుద్ధ్యం లోపంతో అవస్థలు
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు
- కోట్ల ఖర్చు – ఫలితం శూన్యం



**ఏటూరునాగారం క్రైమ్ , ఏప్రిల్ 05 (డిడి9 వార్త):**

ప్రపంచ ప్రసిద్ధి చెందిన సమ్మక్కసారలమ్మ జాతర సందర్భంగా మేడారానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తుండగా, భక్తుల సౌకర్యాలపై తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. గద్దెలు, జంపన్న వాగు, చిలకల గుట్ట ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు బెల్లం (నిలువెత్తు బంగారం), ఆభరణాలు, కోళ్లు, మేకలు సమర్పిస్తూ దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణం అవుతున్నారు.

**ఎండలో కాలుతున్న కాళ్లు – తీవ్ర ఇబ్బందులు**

ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో గద్దెల వద్దకు వెళ్లే భక్తుల కాళ్లు కాలిపోతున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. గద్దెల ముందు టార్పాలిన్ లేదా కార్పెట్లు వేయకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**తాగునీటి కోసం భక్తుల గోస**

మేడారం ప్రాంతంలో తాగునీటి సరఫరా సరైన విధంగా లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు భక్తులు తాగునీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు.

**పారిశుద్ధ్యం లేక గందరగోళం**

మేడారం ప్రాంతంలో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా మారింది. చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి ఉండటంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. దేవాదాయ శాఖ అధికారులు ప్రాంతంలో కనిపించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**కోట్ల రూపాయలు ఖర్చు – ఫలితం శూన్యం?**

ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపణలు వస్తున్నాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో కూడా ఆలస్యం జరుగుతోందని భక్తులు అంటున్నారు.







# పస్రాలో ఘనంగా ఈస్టర్ వేడుకలు

- ముఖ్య అతిథిగా : ఎస్సై తాజుద్దీన్

**గోవిందరావుపేట, ఏప్రిల్ 5 (డి డి 9 వార్త )**

మండలంలోని పస్రా గ్రామంలో ఉన్న మొదటి పెంతెకొస్తు ఉజ్జీవ దేవుని సంఘంలో ఆదివారం ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పస్రా ఎస్సై తాజుద్దీన్, ట్రైనింగ్ ఎస్సై సతీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు క్రీస్తు పునరుత్మన ప్రాముఖ్యతను సంఘ సభ్యులకు వివరించారు. ప్రజలు ఐక్యతతో జీవిస్తూ, విభేదాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలను విడిచిపెట్టి మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే విధంగా జీవించాలనే సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా అందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం పాస్టర్ జ్యోతి ప్రవీణ్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగగా, పాస్టర్ అమ్మ జ్యోతి రాణి ఈస్టర్ క్యాండిల్ వెలిగించారు. తర్వాత పాస్టర్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ వేడుకల్లో సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, అతిథులను ప్రేమతో సత్కరించి అభినందనలు తెలిపారు.



# సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత రైతులకు సత్వర న్యాయం కావాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

**మధిర ఏప్రిల్ 05,(డిడి9 వార్త):**

సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత రైతులకు సత్వరమే పరిహారం అందించాలని,ప్రభుత్వం రైతులకు ఒక్కో టిక్కికి 2000 రూపాయలు చొప్పున సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ మధిర నందు బాధిత రైతుల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు హాజరయ్యారు, ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ దురదృష్టవశాస్తూ సంభవించిన సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదం వల్ల రైతులు తమ సర్వస్వాన్ని పోగొట్టుకున్నట్లు అయిందన్నారు. మిర్చి పంట సాగు చేయడం అంటే నిరంతరం తెగుళ్లతో ప్రకృతితో మార్కెట్తో యుద్ధం చేయాల్సి వస్తుందని అన్నారు,అన్నిటిని దాటుకొని పంట చేతికి వస్తే వచ్చిన పంటను స్టోరేజీ నందు భద్రపరిస్తే అగ్ని ప్రమాదానికి దగ్ధమైన విషయం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందని అన్నారు,అప్పుల ఊబిలో ఉన్న మిర్చి రైతులు ఆశలను ఈ అగ్ని ప్రమాదం బుగ్గిపాలు చేసిందని అన్నారు,ఇన్సూరెన్స్ కంపెనీ జాప్యం చేయకుండా వెంటనే నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు,ఆలస్యం అయ్యే కొద్దీ రైతులకు అందే పరిహారం అప్పులను పెంచుతుందని అన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు వేగవంతంగా పారదర్శకంగా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు మడుపల్లి గోపాలరావు సంఘం డివిజన కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు సిఐటియు జిల్లా నాయకులు శీలం నరసింహారావు గువ్వల సీతారెడ్డి మరియు వెంకటరెడ్డి బాధిత రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాధిత రైతుల పక్షాన పోరాడేందుకు 30 మందితో కూడిన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

కమిటీ కన్వీనర్ గా దివ్వెల వీరయ్యను, కోకన్వీనర్ గా గువ్వల సీతారామరెడ్డిని ఎన్నుకోవడం జరిగింది. బాధిత రైతుల పక్షాన కమిటీ పని చేస్తుందని తెలియజేశారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రతి రెవిన్యూ గ్రామంలో ఏర్పాటు చేయాలి

- ఏఐకేఎఫ్ అఖిలభారత కిసాన్ ఫెడరేషన్ రైతు సమాఖ్య రాష్ట్ర కోశాధికారి గుండెబోయిన చంద్రయ్య



**డి డి 9 వార్త ములుగు టౌన్**

ములుగు జిల్లా మల్లంపల్లి మండల రెవిన్యూ గ్రామాలు దేవనగరం సోమల తండా మామిడి రేవుపల్లి తండా గ్రామాల రైతులతో మాట్లాడుతు గుండెబోయిన చంద్రయ్య రైతుల బాధలు అడిగి తెలుసుకోనైనది ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు లేదని అన్నారు బహిరంగ మార్కెట్లో మధ్య దళారులు 1800 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు రైతులు విత్తనాలు నాలుగు కేజీల సంచికి 2000 నుండి 2500 రూపాయలు ఒక ఎకరాకు విత్తనం5000 రూపాయలు ఖర్చుపెట్టి యూరియా బ్లాకులో కొనుగోలు చేసి పెట్టుబడులు పెట్టి నాలుగు నెలలు కష్టపడి పండిస్తే ప్రభుత్వం ప్రకటించిన ఎం ఎస్ పి మద్దతు ధర 2400 రూపాయలు ధర రావటం లేదు మధ్య దళారులు మద్దతు ధర కు కొనుగోలు చేయడం లేదు విత్తనాలు ఎరువులు అమ్మే కాడీనుండి పంట కొనుగోలు వరకు రైతులు మోసపోతున్నారు రైతులేమో అప్పులపాలు అవుతుంటే మధ్య దళారులు కోట్ల రూపాయ లు సంపాదించుకుంటునరు రైతుల శ్రమను వారి కష్టాన్ని దోస్కుంటున్నారని ఆందోళన వ్యక్తం చేసినారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రంలో మార్క్ ఫెడ్ ద్వారా ప్రతి రెవిన్యూ గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఆదుకో వాలని ఎమ్మెస్ పి ధర 2400 రూపాయలు కింటాలుకు మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేసినారు తెలంగాణ రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలు మొక్కజొన్న సాగు చేశారని ప్రభుత్వమేమో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు 11 లక్షలు సాగైందని అంటున్నారు ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలు వరంగల్ ఖమ్మంతో పాటు 17 జిల్లాలలో ప్రతి పంట తీవ్రంగా నష్టపోయిన రైతులు మొక్కజొన్న ప్రత్యామ్నాయ పంటగా సాగు చేసినారు గత మూడు సంవత్సరాల నుండి మిర్చి పత్తి పండించే రైతులు అప్పుల పాలై ముఖ్యంగా కవులు రైతులు ఆత్మహ త్యలు చేసుకున్నారు ఈ సంవత్సరం మిర్చి పత్తి పంటలు మానేసి మొక్కజొన్న సాగు చేసినారు ఈసారి మద్దతు ధర అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు మొక్కజొన్న కోతలు ప్రారంభమై15 రోజులు అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు దళారులు దోసుకున్నాక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే దళారులే రైతుల పేరు మీద మార్క్ పెడ్క అమ్ముతారని వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సిబ్బంది కొరత ఉంటే మార్క్ పెయిడ్ సంస్థకు ఐకెపి సెంటర్ల ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు నాయకులు ఏఐకేఎఫ్ తెలంగాణ స్టేట్ కోశాధికారి గుండెబోయిన చంద్రయ్య మల్లంపల్లి మండల కార్యదర్శి పొర్ల కొమురయ్య రాసర్ల చంద్రమౌళి వడ్లూరి వెంకన్న రైతులు ఆకుల కుమార స్వామి ఏసవేన లక్షణారి బానోతు రాములు ఓజ్జల ఐలయ్య మొర్రి రాజు మహిళా రైతులు రాధక్క ఏషవేనా తదితరులు పాల్గొన్నారు



## సిపిఎం కార్యాలయంలో బీటి రణదివే కి ఘన నివాళులు అర్పించిన నాయకులు

**బోనకల్,ఏప్రిల్ 05,(డీడీ9 వార్త):** సిఐటియు వ్యవస్థాపకులు, సిపిఎం వ్యవస్థాపకులలో ఒకరు,తన జీవితాంతం కార్మిక, శ్రామిక,కర్షకుల అభ్యుదయం కోసం పోరాడిన యోధుడు బిటి రణధీవే 36వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం బోనకల్ మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయం వద్ద సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు,సిపిఎం మండల కార్యదర్శి కిలారు సురేష్,సిఐటియు మండల కన్వీనర్ గుగులోత్ నరేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు తెల్లాకుల శ్రీనివాసరావు,బంధం శ్రీనివాసరావు,మహిళా సంఘం మధిర డివిజన్ అధ్యక్షురాలు జొన్నలగడ్డ సునీత,ముష్టికుంట స్టడీ సర్కిల్ కన్వీనర్ పిల్లలమర్రి వెంకట అప్పారావు, సిఐటియు నాయకులు బూర్గుల అప్పాచారి,ఎస్కే శిలార్,బుజ్జి మేస్త్రి,గుగులోతు శ్రీను,రైతు సంఘం నాయకులు బొప్పాల రమేష్,గండు సైదులు,కంసాని సూర్యప్రకాశ్రావు,గద్దె రామారావు,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉప్పర శ్రీను,కెవిపిఎస్ నాయకులు ఏసుపోగు బాబు తదితరులు బిటి రణదివేకు ఘనంగా జోహార్లు అర్పించారు.




# దళిత మేధావులు ముందుకు రావాలి

- **దేశ నిర్మాణంలో జగ్జీవన్ రామ్ పాత్ర ప్రశంసనీయం**
- **సామాజిక సమానత్వానికి ఆయన సేవలు చిరస్మరణీయం**
- **దళితుల అభ్యున్నతికి ఐక్యత అవసరం**
- **హనుమకొండ లో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో**
- **కడియం కావ్య కీలక వ్యాఖ్యలు**

**జనగామ ఏప్రిల్ 5(డిడి 9వార్త ) బ్యూరో**

హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడాయి. ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా ఎంపీ డా. కడియం కావ్య బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ దేశ నిర్మాణంలో విశిష్ట పాత్ర పోషించిన మహనీయుడని కొనియాడారు. సామాజిక సమానత్వం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే దళిత వర్గాలకు సమాన అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. అదే రాజ్యాంగం కారణంగా తాను దళిత బిడ్డగా పార్లమెంట్ స్థాయికి ఎదగగలిగానని చెప్పారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాజం మరింత చైతన్యంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యారంగంలో ప్రభుత్వ,కార్పొరేట్ పాఠశాలల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించాలని, దళిత మేధావులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు.అలాగే ఎస్సీ వర్గాలు ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. వచ్చే ఏడాదిలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు చర్యలు



తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పస్రా గ్రామపంచాయతీ,లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**గోవిందరావుపేట, ఏప్రిల్ 5 (డి డి 9 వార్త)**

ఆదివారం పస్రా గ్రామ పంచాయతీ కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్య సుమలత, ఉప సర్పంచ్ సప్పిడి సంజన పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి గౌరవప్రదంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సుమలత,సంజన మాట్లాడుతూ, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు, సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.

గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని మహానేతకు ఘన నివాళులు అర్పించారు.

# అంగన్ వాడి కేంద్రాల్లో శ్రీమంతలు, చదువుల పండుగ,,,!!

- **రోజుకు మూడు కేంద్రాల్లో ఈపండుగ సంబరాల నిర్వహన,,**
- **గర్బిణిలు, పిల్లలకు సౌష్టికాహారం పెట్టెబాద్యత మీదె,,,**
- **కాటారపురం క్లష్టరులో అంగన్వాడి సెంటర్లు ముస్తాబు,,,**
- **సర్పంచు దిడ్డి మొహన్ రావు చే పిల్లలకు అక్షరాలు దిద్దె,,,**

**ఏటూరునాగారం క్రైం డిడి9 వార్త ఏప్రిల్ 05**

అంగన్ వాడికేంద్రాలలో శ్రీమం తాల పండుగ అంగరంగ వైభ వంగా నిర్వహిస్తున్నారు, అంతెకాకుండా ఈకేంద్రాలకు చదువుకునెందుకు అక్షరాలు నేర్చుకోవడం కోసంతల్లిదండ్రులు పంపిస్తున్నారు ఈవిద్యాసవత్సరం లొ ఆవీదిలొని పిల్లల ను అడ్మిషన్ చేస్తున్నారు,అదేవిదంగా ఈకేంద్రాల పరిదిలొని గర్బిణిలు ఆరోగ్యంగా ఎదిగాలు,,సౌష్టికరమైన ఆహరం తిని ఆరోగ్యవంతమైన పిల్లలు జన్మిస్తారు, ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాటాపురం సర్పంచుదిడ్డి మొహన్ రావు ఆజరయ్యరు, ఈ సంర్బంగా గర్బిణీలకు శ్రీమంతాలను నిర్వహించారు అదే విధంగాచిన్నపిల్లవకుఅక్షరాలను పలకలపై అబ్యాసం చేయించారు ప్రతీసెంటర్ లొ ఇదేపండుగను నిర్వహించారు సర్పంచు హజరయి గర్బిణీలను దీవించి,,పిల్లలకు అక్షరాలు నేర్పించినందుకు అంగన్ వాడిటీచర్లు,,హెల్పర్లు హర్షంవ్యక్తం చేశారు,,గతంలొ అంగన్ వాడి కేంద్రాలలొ వాల్లె చేసెది సి డి పి ఒ నొ వీ




లులేకుంటె సూపర్ వైజరొ వచ్చేది పాత్రికేయులను కూడ ఆహ్వానం పిలవక పోయెది ఈసారిమాత్రం అందరిని ఆహ్వానం పంపిస్తున్నారు,

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు

**బోనకల్,ఏప్రిల్ 02,(డీడీ9 వార్త):** జానకిపురంలోని స్వతంత్ర సమరయోధులు మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చిలక నాగరాజ్ మాదిగ మాట్లాడుతూ సామాజిక సంఘసంస్కర్త స్వతంత్ర ఉద్యమకారులు జగ్జీవన్ రామ్ చేసిన కృషి భారత సమాజం వెనకబడిన,దళిత వర్గాలకు ఎన్నో సేవలను అందించారన్నారు,భారత రాజ్యాంగ రచన కమిటీ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అయితే రాజ్యాంగ పరిశీలన కమిటీలు మొత్తం పది ఉండగా నాలుగు కమిటీలలో బాబు జగజీవన్ రామ్ అంబేద్కర్ రాసినటువంటి రాజ్యాంగాన్ని అమలు చేయుటకు కృషి చేశారన్నారు,ఈ దేశ ఉప ప్రధానిగా,రక్షణ శాఖగా,కార్మిక శాఖతో పాటు అనేక సేవలు అందించారన్నారు,వారి ఆశయాలను కొనసాగించడానికి మనమందరము కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలక వెంకటేశ్వర్లు పెద్దలు కర్లకుంట శేషయ్య,కోట హనుమంతురావు, బోల్లెపోగు ప్రసాద్,సయ్యద్ మదర్ సాహెబ్,గోగుల కృష్ణ,చిలక ఏసురత్నం,చిలక ప్రసాద్, తోటకూర అనంత రాములు,పంజి రమేష్,బోల్లెపోగు భూషణం షేక్ నాగులు మీరా,కర్లకుంట ఏసోబు,చిలక రవికుమార్,బోల్లెపోగు చిన్న వెంకటేశ్వర్లు,దారెల్లి వెంకటి మోదుగు బాబు,కొత్త నాగేశ్వరరావు పాల్గొన్నారు.






# శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు

**పాలకుర్తి ఏప్రిల్ 05 (డిడి 9 వార్త)**

పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి యాదగిరిగుట్టలోని శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వారిని ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి రాష్ట్ర ప్రజల సుఖశాంతులు శ్రేయస్సు మరియు ప్రాంత అభివృద్ధి కోసం ఆమె ప్రార్ధనలు చేశారు ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే గారిని అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతించి వేదమంత్రాల నాదాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు

# సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

- **గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడి ప్రణాళిక బద్ధంగా జరిగింది**
- **రాష్ట్రంలో చట్టవ్యవస్థపై సందేహాలు**
- **"హేట్ స్పీచ్" పేరుతో ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారంటూ విమర్శ**
- **గూండాలతో దాడులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం**
- **ప్రజాస్వామ్యం కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సి వస్తుంది**

**పాలకుర్తి ఏప్రిల్ 05(డిడి 9 వార్త)**

గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పై జరిగిన దాడిపై రాష్ట్ర మాజీ మంత్రివర్యులు మాజీ మంత్రి ఎర్రబెల్లి తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది సాధారణ ఘటన కాదని, ప్రణాళికాబద్ధంగా జరిగిన దాడి అని ఆరోపించారు ఇది కేవలం ఒక కార్యాలయం పై జరిగిన దాడి మాత్రమే కాదు తెలంగాణ ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా భావిస్తున్నాము పట్టపగలు అందరూ చూస్తుండగానే జరిగిన ఈ ఘటన రాష్ట్రంలో చట్టవ్యవస్థ పరిస్థితిపై తీవ్ర సందేహాలు రేకెత్తిస్తోంది రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? లేక రాజకీయ అరాచకాలకు మార్గం సుగమం అవుతోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి ఒకవైపు "హేట్ స్పీచ్" పేరుతో ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ, మరోవైపు గూండాలతో దాడులు చేయించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటూ హామీలు ఇచ్చిన వారు, నేడు ప్రతిపక్షంపై దాడులు జరుగుతున్నప్పటికీ



మౌనం వహించడం బాధాకరం అధికార మదంతో విర్రవీగుతున్న కాంగ్రెస్ నాయకుల తీరు ప్రజాస్వామ్య విలువలను తుంచివేస్తోంది శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం పాక్షికంగా వ్యవహరిస్తోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ గూండా రాజ్యాన్ని అమలు చేస్తారా? ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల రాజకీయ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండగా, రాష్ట్ర పాలనను ఎవరు పర్యవేక్షిస్తున్నారు? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి బీఆర్ఎస్ పార్టీ స్పష్టంగా తెలియజేస్తోంది — ఇలాంటి అణచివేతలు, దాడులు మమ్మల్ని భయపెట్టలేవు ప్రజాక్షేత్రంలో ప్రతి అడుగులో మీ విధానాలను ప్రశ్నిస్తూ, ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తాము గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పై దాడి చేసిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని రాష్ట్ర పోలీసు శాఖను డిమాండ్ చేస్తున్నాము ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తున్నాము.

# పద్మావతి కాలనీలో వైభవంగా పోచమ్మ బోనాలు!!

- **భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించిన భక్తులు**
- **ఆధ్యాత్మిక శోభతో పులకించిన వీధులు**
- **ప్రతి ఇంటా సుఖశాంతులు వెల్లివిరియాలె**
- **49వ డివిజన్ కార్పొరేటర్ సాగి సంతోష్ రావు**



**పెద్దపల్లి బ్యూరో, ఏప్రిల్ 05 (డిడి9 వార్త):**

పద్మావతి కాలనీలోని బొల్గం సురేష్ గౌడ్ నివాసం నుండి ఆదివారం అమ్మవారి పోచమ్మ బోనాల ఉత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమైంది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో 49వ డివిజన్ కార్పొరేటర్ సాగి సంతోష్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, వారితో పాటు 48వ డివిజన్ కార్పొరేటర్ రేణిగుంట్ల నిర్మలాదేవి తిరుపతి, కాలనీ అధ్యక్షులు డాక్టర్ రవికుమార్ నాగండ్ల, ప్రముఖులు పెరటి ప్రభాకర్ రెడ్డి, పిట్ట లక్ష్మీనర్సయ్య, పెరటి రవీందర్ రెడ్డి, సూర్య ప్రకాష్, చిదురాల రాజి రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొని ఉత్సవ శోభను పెంచారు. రంగు రంగుల పూలతో అలంకరించిన బోనాలతో మహిళలు భక్తి పారవశ్యంలో మునిగితేలగా, పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో ప్రధాన చౌరస్తా మార్మోగిపోయాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగను కాలనీ వాసులందరూ కలిసికట్టుగా జరుపుకోవడం శుభ పరిణామమని, ఆ చల్లని అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. భక్తుల కోలాహలం మధ్య సాగిన ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కాలనీలోని ప్రతి ఇంటా సుఖశాంతులు వెల్లివిరియాలని, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ, ఈ వేడుకను విజయవంతం చేసిన కాలనీ వాసులకు, కమిటీ సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. భక్తి భావం వెల్లివిరిసిన ఈ కార్యక్రమంలో చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. పద్మావతి కాలనీ పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయి, ఈ బోనాల ఉత్సవం స్థానికులలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.



# తుమ్మల హరిబాబును పరామర్శించిన, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు

**గోవిందరావుపేట, ఏప్రిల్ 5( డి డి 9 వార్త )**

బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, గోవిందరావుపేట మండల మాజీ జెడ్పిటిసి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ తుమ్మల హరిబాబు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆయనను పరామర్శించారు. హార్ట్ ఎటాక్ కారణంగా హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హరిబాబును కలిసిన లక్ష్మణ్ బాబు, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా హరిబాబు త్వరగా కోలుకొని మళ్లీ ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. తుమ్మల హరిబాబు గోవిందరావుపేట మండలంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ప్రజలతో మమేకమై వారి అభ్యున్నతికి సేవలందించిన ఆయన త్వరగా కోలుకోవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.



# జడ్పీహెచ్ఎస్ పసర లో పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం

**గోవిందరావుపేట, ఏప్రిల్ 5 (డి డి 9 వార్త)**

జడ్పీహెచ్ఎస్ పసర నాగారం పాఠశాలలో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం నిర్వహించారు. 2022లో స్థాపితమైన ఈ సంఘం, పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు ఎన్నో అమూల్యమైన సేవలు, సౌకర్యాలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కాట్రగడ్డ సతీష్ కుమార్ మాట్లాడుతూ, పూర్వ విద్యార్థులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి, అవసరమైన సందర్భాల్లో తమ మిత్రులకు అండగా నిలుస్తూ సహాయ సహకారాలు అందించడం సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేద విద్యార్థుల కోసం చేస్తున్న సేవలు తమకు ఎంతో సంతృప్తిని ఇస్తున్నాయని పేర్కొన్నారు.

అలాగే, సంఘం ఏర్పాటైనప్పటి నుంచి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తూ, కొత్త కమిటీ ఎన్నికలు జరుపుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 2026 ఏప్రిల్ 14న సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కమిటీ ఎన్నికలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

198182 నుండి 201718 వరకు పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులలో ప్రతి బ్యాచ్ నుండి ఒక్కరిని కమిటీ సభ్యునిగా ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. కాబట్టి అన్ని బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బొబ్బక్రాంతి కుమార్, కోశాధికారి బీరెడ్డి సాంబశివ, ఉపాధ్యక్షులు పొదిళ్ల చిట్టిబాబు, గౌరవ అధ్యక్షులు సూడి శ్రీనివాసరెడ్డి మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.



# బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహణ

- **నివాళులు అర్పించిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ....**

**అశ్వారావుపేట:ఏప్రిల్05 (డిడి 9 వార్త)**

భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ జయంతిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

కార్యక్రమం ప్రారంభంలో నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు కలిసి బాబు జగ్జీవన్ రామ్ గారి సేవలను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలను గుర్తు చేసుకుంటూ పలువురు నేతలు మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య సమరంలో ఆయన పోషించిన పాత్ర ఎంతో గొప్పదని, స్వాతంత్ర్యం అనంతరం దేశ అభివృద్ధి దిశగా ఆయన చూపిన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని కొనియాడారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గారు మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ గారు సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల సాధనలో ఆయన చేసిన కృషి అపారమని, సమానత్వం కోసం ఆయన చూపిన దృక్పథం నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. ఆయన ఆలోచనలు, విలువలు ప్రతి ఒక్కరి జీవితంలో ప్రతిఫలించాల్సిన అవసరం ఉందని అన్నారు.

అలాగే గ్రామీణాభివృద్ధి, కార్మిక సంక్షేమం, వ్యవసాయ రంగానికి ఆయన అందించిన సేవలు దేశ నిర్మాణంలో కీలకమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. దేశ రాజకీయాల్లో ఆయన చూపిన నిబద్ధత, నిజాయితీ, ప్రజల పట్ల ఉన్న సేవాభావం ప్రతి ప్రజాప్రతినిధి అనుసరించాల్సిన మార్గమని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువజన సంఘాల సభ్యులు, మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీగా మొహమ్మద్ జాకీర్

**మల్కాజ్ గిరి,ఏప్రిల్ 4,(డిడి9 వార్త):**

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీగా మొహమ్మద్ జాకీర్‌ను నియమించారు. ఈ నియామకం పార్టీ వర్గాల్లో ఆనందాన్ని కలిగించింది.

టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆమోదంతో, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో ఈ నియామకం జరిగింది.



# సీతక్కభరోసా,,, ఆ కుటుంబానికి ఆసరా,,,!!

- **సమ్మక్క పూజారి కుటుంబం బాధను తెల్సుకుని పూర్తి వైద్యం**
- **అన్ని విధాల ఆధుకుంటానని కుటుంబ సభ్యులకు భరోసా,,**
- **ఈసంఘటన బాధకరమనె,, చింతించెను,,**
- **దీనిని రాజకీయం చేయెద్దని పూజారి రమేష్- స్వప్న కోరె,,,**
- **ఆదివాసి మహి నాయకురాలు తాటి లక్షికూడ విజ్ఞప్తి చేసెను,,**





**ఏటూరునాగారం క్రైం డిడి 9 వార్త ఏప్రిల్ 05**

మేడారం పూజారి కుటుంబానికి రమేష్ స్వప్నలకు మంత్రి సీతక్క భరోసా ఇచ్చెను,అంతెకాం కుండా ఆదివాసి నాయకురాలు తాటి ఆదిలక్ష్మి కూడా ఈవిషయంపై సీతక్క ఆదుకుంటామని భరోసా నట్లు తెలిపారు గడసిన కొద్ది రోజుల కిందట మేడారం పూజారి కుమారుడు యువర్గ ద్దెలవైపు వెల్లగా చిన్నరాయి పిల్లర్ విరిగిపిల్లవాడి కాలుపై పడివేల్లు పగిలాయి రక్తస్రావం జరిగితె హన్మకొండలోని ప్రవేటు ఆసుపత్రికు తీసుకెల్లి చికిత్స చేయించగా ఆపరేషన్ చేసినవైద్యులు ,,కొంతబాగం తొలగించవలసివస్తుంది అని పేరెన్స్ కు తెలిపగా కాలుకు ఏమైన ప్రమాదనె అందుకు పేరెన్న్ సరైన అనడంతొ వైద్యం చేసెను పెరిగి ప్రయెజికుడు కావాలని కోరుకుని దేవుల్లకు ,,దేవతలకు ఎన్నొమొక్కులిచ్చాం కొడుకుపెరిగితె ఆదుకుంటాడని ఆశలు పెట్టుకున్న కొడుకు మన ఆశలను ఆ దేవుడు అడవాశలు చేశాడని వానిజీవితాన్నె చీకటి మయం చేశాడని ప్రతీరోజు రోదిస్తున్నారు

**సీతక్కభరోసా,,**

**ఆకుటుంబానికి ఆసరా,,,!!**

సీతక్క పూజారి ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు ఈక్రమంలొ ఆ కుటుంబం సరైన ఒప్పు కున్నట్లు తెలుపారు,,ఈక్రమంలొ పూజారి కొనుక్కున్న జరిగిన ప్రమాదం విషయం తెల్సు కున్నమంత్రిసీతక్క వివిధదిన పత్రికలు టీవిలలొ,పలువురు పార్టినాయకులు మంత్రిదృష్టికి తీసుకెల్లినట్లు తెల్సింది, ఈక్రమంలొ పూజారి రమేష్‌తొ ఆయన సతీమణి స్వప్నకు విషయాలు క్షుణ్ణంగా చెప్పినట్లు తెలిపారు,పూర్తిగానయం అయెదాక వైద్యం ఆర్థిక సాయం,ఇంకా ఏమైన ఆశించితె అధికూడ ఇప్పించాలని ఒప్పుకున్నట్లు తెలిపారు,,

**ఈసంఘటన రాజకీయం చేయ్యద్దని హితవు,,!!**

ఈసంఘటనను ఎవరుకూడా రాజకీయం చేయెద్దని పూజారి కుటుంబం,,ఆదివాసి నాయకరాలు తాటి ఆదిలక్ష్మి విజ్ఞప్తి చేశారు ఇప్పటికె రమేష్ కుటుంబం శోఖంతొ ఉంది ఏవిషయంలోను అప్రతిష్టపాలు చేయెద్దు మాకు సీతక్క ఆదుకుని అండగా నిలబడుతామని అభయం ఇచ్చినట్లు తెలిపారు.

# మెగా వైద్య శిబిరం..గ్రామీణులకు ఆరోగ్య వరం..!

- **అనంతారంలో మెగా వైద్య శిబిరం విజయవంతం**
- **సేవా స్ఫూర్తితో వైద్యుల ముందడుగు**
- **మెడికల్ అసోసియేషన్ సేవా స్ఫూర్తి అబినందనీయం**




***కరకగూడెం:april 5,DD9 VAARTHA.**

మండల పరిధిలోని అనంతారం జెడ్పి పాఠశాల ఆవరణలో ఆదివారం మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయ్యింది.ఈ శిబిరంలో మణుగూరు పట్టణానికి చెందిన వివిధ విభాగాల ప్రముఖ వైద్యులు Dr.కొమ్మా మధుసూదన్ రావు ,బుడగం రామకృష్ణ పిల్లల వైద్య నిపుణులు భవానీ స్త్రీ వైద్య నిపుణులు,Dr వీర శేఖర్ D.ortho,Dr. ఉమా శంకర్ MBBS,Dr. మోహన్ వంశీ యాదవ్ MD.తో పాటు ప్రభుత్వ నేత్ర వైద్యులు Dr. సంజీవరావు పాల్గొని రోగులను పరీక్షించారు.శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేయడంతో పాటు,అనేక మంది ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు.నిర్వాహకులు సుమారు 240 మందికి విలువైన మందులను ఉచితంగా అందజేశారు.అలాగే మరో 160 మందికి మధుమేహం, రక్తపోటు (బీపీ) పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను కూడా అందించారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంపై మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చిన్న చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే చికిత్స పొందితే తీవ్రమైన వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు కృషి చేయాలనీ,మెడికల్ అసోసియేషన్ సేవా స్ఫూర్తి అబినందనీయంమని వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాయం కృష్ణవేణి,మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు,సభ్యులు రాధా శ్యామ్ గుప్తా, సురేష్, రామ మెడికల్ సత్యనారాయణ,పద్మ మెడికల్ కొమ్మా సత్యనారాయణ జగదీష్,శ్రీనివాస్,ఎల్లారెడ్డి ,షేక్ సోందుపాషా, కొమ్మా ప్రసాద్, మస్తాన్, రామలింగం, రాజు, అత్తె దినేష్, ప్రవీణ్,గ్రామ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలి

- **అఖిల భారత రైతు కూలి సంఘం,సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డిమాండ్**
- **లక్ష్మీపురం గ్రామంలో మొక్కజొన్న కల్లాలను పరిశీలించిన జిల్లా నాయకులు ఎంగిరి**



**బోనకల్,ఏప్రిల్ 02,(డీడీ9 వార్త):**

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం 31 కేంద్రాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసిందనీ,అలా కాకుండా అవసరం ఉన్న ప్రతి చోట మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందనీ గిరి డిమాండ్ చేశారు, ఆదివారం మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో మొక్కజొన్న కలలను ఆయన పరిశీలించారు, ఈ సందర్భంగా గిరి మాట్లాడుతూ ఎకరానికి 25 క్వింటాల నిబంధనను ఎత్తివేసి పూర్తిగా పండించిన పంటను మొత్తం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు,గత ఏడాది 232400,వందలకు మొక్కజొన్నలు కొనుగోలు చేశారని,ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలలో ప్రైవేటు దళారులు రైతుల వద్ద 1600, 1700 రూపాయలకి అడ్డంగా కొనుగోలు చేస్తున్నారన్నారు,రైతులు పండించిన పంటను దాచుకోలేక నిల్వ చేసుకునే అవకాశం లేక పోవడంతోనే పంటను అమ్ముకుంటున్నారన్నారు,తక్షణమే రైతుల వద్ద మొక్కజొన్న,వరిని మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలన్నారు ,ఈ కార్యక్రమంలో

ఏఐకేఎంఎస్ మండల నాయకులు వెంకటేశ్వర్లు, గోవిందరావు,కొండలరావు కృష్ణవేణి,రవి ,అఖిల్,రమా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




# ఆక్రమణ'దారుల'తో గోల

- శంకుస్థాపన అయి ఎనిమిది నెలలు పూర్తి.. యజమానుల సహకారం లేక అసంపూర్తి
- మూడు దశాబ్దాల కల నెరవేరే వేళ.. రోడ్డు ఆక్రమణల గోల
- ప్రజాపాలన ప్రభుత్వంలోనే ఇలా.. ప్రజలే అభివృద్ధికి మోకాలడ్డితే ఎలా?
- రోడ్ల నిర్మాణంతో హర్షం వ్యక్తం చేసిన జనం.. మూన్నాళ్ళ ముచ్చటేనా అని విమర్శిస్తున్నవైనం
- అభివృద్ధికి అడ్డుపడుతుంటే ప్రతిక్షణం.. పంచాయతీ అధికారులెందుకు వహిస్తున్నారు మౌనం
- ప్రజలకు కావాల్సింది రోడ్డు నిర్మాణం.. అధికారులే చూపాలి ఈ సమస్యకు పరిష్కారం
- పంచాయతీరాజ్ శాఖ

**రోడ్లపై.. ఆక్రమణ'దారుల' పంచాయతీలా**

**చర్ల, ఏప్రిల్ 5 (డిడి 9 వార్త)**

మూడు దశాబ్దాల కల ఎన్నో విఘ్నాలను దాటుకొని మోక్షం లభించింది అనుకున్న తరుణంలో రహదారి నిర్మాణ పనులు ఆరంభమయ్యాయని హర్షం వ్యక్తం చేసిన మూడు రోజులకే ఆదిలోనే హంసపాదు అనే విధంగా నిర్మాణ పనులు నిలిచిపోవడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల ఆర్ అండ్ బి రోడ్డు నుండి దోసిళ్లపల్లి రోడ్డు (జవ్వాది నారాయణమూర్తి నాయుడు రోడ్డు)వరకు 1 కోటి 10 లక్షల వ్యయంతో రహదారి నిర్మాణానికి గత ఏడాది జూలై 21 న స్థానిక శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు శంకుస్థాపన చేసిన విషయం విధితమే. ఈ మేరకు గత నెల మార్చి 10న చర్ల పంచాయతీ కార్యదర్శి తోకల సురేష్ గ్రామపంచాయతీ పరిధిలో గల టీజీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఆర్ అండ్ బి రోడ్డు నుండి దోసిళ్లపల్లి రోడ్డు వరకు మెయింటెనెన్స్ ఆఫ్ రూరల్ రోడ్స్ (ఎం.ఆర్.ఆర్) నిధులు 1 కోటి 10 లక్షల రూపాయలతో సి.సి రోడ్డు నిర్మాణంతో పాటు రోడ్డుకు ఇరువైపులా సి.సి డ్రయిన్ మంజూరి అయిన క్రమంలో పంచాయతీరాజ్ (పి.ఆర్)మరియు రూరల్ డెవలప్మెంట్ (ఆర్.డి)రోడ్స్ శాఖ వారి ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టడం కొరకు రోడ్డు మధ్యభాగం నుండి రోడ్డుకు ఇరువైపులా 20 అడుగుల స్థలం కావలసినందున 20 అడుగుల లోపు ఉన్న నిర్మాణాలను నోటీసు అందిన మూడు రోజుల్లో తొలగించాలని లేనియెడల పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనబడతాయని నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేస్తూ కొందరు ఆక్రమణదారులు వారి గృహాలను హద్దు మీరి సరిహద్దులు దాటి రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలమని తెలిసి కూడా ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపట్టిన గృహ యజమానులు రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న వారి అక్రమ కట్టడాలను తొలగించకుండా గుత్తేదారుకు అడుగడుగున అడ్డుపడుతూ నిర్మాణ పనులకు ఆటంకం కలిగిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణదారులు స్వార్థంతో వారి స్వలాభం కోసం ఎన్నో గ్రామాల ప్రజలకు ఇతర రాష్ట్రాల వారికి సౌకర్యంగా మారబోయే రహదారి నిర్మాణాన్ని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని, చట్టాలను అతిక్రమించి ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి చేస్తున్న చట్ట వ్యతిరేక చర్యలను ఆపవలసిన బాధ్యత అధికారులదేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రజలకు సేవ చేయాల్సిన కొందరు రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు వారి స్వలాభం కొరకు అభివృద్ధికి అవరోధంగా మారడమేమిటని ధ్వజమెత్తారు. రహదారి నిర్మాణానికి అవసరమైన ఇసుక, వెట్ చిప్స్, సిమెంట్ వంటి మెటీరియల్స్ ను గుత్తేదారు ఎంతో వ్యయం వెచ్చించి కొనుగోలు చేసి రోడ్డు వేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసుకున్న అనంతరం పనులు జరగకుండా మోకాలడ్డుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో చాలామంది గృహ యజమానులు స్వచ్ఛందంగా రోడ్డుపైకి విస్తరించిన వారి నిర్మాణాలను తొలగించడానికి ప్రభుత్వ అధికారులకు సహకరించారని, వారు నడిచేందుకు గాని వారి వాహనాలు ఇంట్లో పెట్టుకునేందుకు దారి లేక రోడ్లపైనే నిలిపి ఉంచుతూ ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని, కొందరు యజమానులు మాత్రం రహదారి నిర్మాణాలకు ఆటంకం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని చట్టం దృష్టిలో అందరూ సమానమని ఎవరికి మినహాయింపు లేదని అందరూ రహదారి నిర్మాణానికి సహకరించాలని హితవు పలికారు. యథేచ్ఛగా రహదారులను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టిన వారి నిర్మాణాలను తొలగించాలని తిరిగి రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించాలని దీనికి ఆయా సంబంధిత శాఖల అధికారులు సహకరించి రహదారి పనులు సజావుగా సాగేలా, సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ప్రజలు అధికారులను కోరుకుంటున్నారు.









# ఖనిలో పురుడుపోసుకున్న కేవీఎస్ అకాడమీ

- కార్పొరేటర్ సాగి సంతోష్ రావు చేతుల మీదుగా ఘన ప్రారంభం
- యువత ప్రతిభకు ప్రోత్సాహం
- విద్యాసాగర్ ఆధ్వర్యంలో వినూత్న ప్రయత్నం
- ఆధునిక సదుపాయాలతో అకాడమీ



**పెద్దపల్లి బ్యూరో, ఏప్రిల్ 05 (డిడి9 వార్త):**

గోదావరిఖనిలో కేవీఎస్ డ్యాన్స్ అకాడమీ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక పద్మావతి కాలనీలో డ్యాన్స్ మాస్టర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అకాడమీని కార్పొరేటర్ సాగి సంతోష్ రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

49వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఈ అకాడమీ ప్రారంభ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాగి సంతోష్ రావు అకాడమీని ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పద్మావతి కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవికుమార్ నాగండ్ల పాల్గొని రిబ్బన్ కట్ చేశారు.

వక్తలు మాట్లాడుతూ, ఆధునిక సదుపాయాలతో ప్రారంభమైన కేవీఎస్ డ్యాన్స్ అకాడమీ స్థానిక యువతకు మంచి వేదికగా మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ రేణికుంట్ల నిర్మలా తిరుపతి, రామకృష్ణ, రాజిరెడ్డి, కాస సత్యనారాయణ, పెరటి ప్రభాకర్ రెడ్డి, పెరటి రవీందర్ రెడ్డి, చిదురాల రాజిరెడ్డి, పిట్ట లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.